# భారత జనాభా 200 కోట్ల మార్కు దాటనుందా !

2024లో ప్రపంచ జనాభా 820 కోట్లు (8.2 బిలియన్లు) చేరిందని, మరో అర్థ శతాబ్దం తర్వాత 2080ల్లో ఈ జనాభా 1,030 కోట్లు (10.3 బిలియన్లు) చేరవచ్చని, ఆ తర్వాత ప్రపంచ జనాభా తగ్గుముఖం పట్టవచ్చని కూడా ఇటీవల విడుదలైన నివేదిక స్పష్టం చేస్తున్నది. ఐరాస జనాభా విభాగం నేతృత్వంలో "వరల్డ్ పాప్యులేషన్ ప్రాస్‌పెక్ట్స్ 2024 (ప్రపంచ జనాభా అవకాశాలు –2024)" విడుదల చేసిన 28వ జనాభా అంచనాల నివేదిక అధ్యయనానికి సంతానోత్పత్తి రేటు, మరణాల రేటు, వలసల నమూనాలను ఆధారంగా చేసుకొని పలు జనాభా సంబంధిత అవకాశాలను శాస్త్రీయంగా విశ్లేషించింది. ఆర్థిక ప్రగతి , వనరుల నిర్వహణ, వైద్య ఆరోగ్య సంరక్షణ, వాతావరణ మార్పులు, పేదరికం, లింగ అసమానతలు లాంటి ప్రధాన అంశాలు ప్రపంచ జనాభాను ప్రభావితం చేస్తుంటాయి.

2080ల్లో 1,000 కోట్లు దాటనున్న ప్రపంచ జనాభా:

ప్రపంచవ్యాప్తంగా 237 దేశాలు, ప్రాంతాల జనాభా వివరాలను 1950 నుంచి నేటి వరకు, ఆ తర్వాత 2100 వరకు విశ్లేషిస్తూ పలు ఆసక్తికర ఫలితాలను బయట పెట్టారు. 2024లో 820 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా మరో 50 – 60 ఏండ్ల తర్వాత అత్యధికంగా 1,030 కోట్లు చేరే అవకాశం ఉందని తేల్చారు. ఆ తర్వాత ఈ శతాబ్దం చివరలో కొంత తగ్గి 1,020 కోట్లకు తగ్గవచ్చని తేల్చారు. నేడు ప్రపంచ సంతానోత్పత్తి రేటు ప్రతి మహిళ 2.25 పిల్లలకు జన్మనిస్తుందని, ఇది 1990లో 3.31 ఉండేదని తెలుస్తున్నది. ప్రపంచంలోని దాదాపు సగం దేశాల్లో సంతానోత్పత్తి రేటు 2.1 వరకు ఉండడం గమనించారు. 2024లో నమోదైన ఆయుర్దాయం 73.3 ఏండ్లు ఉండగా, 1995లో 68.9 మాత్రమే ఉండేదని వివరిస్తున్నారు. 2054 వరకు జనాభా ఆయుర్దాయం 77.4 వరకు చేరవచ్చని తేల్చారు. 2024లో 4.7 మిలియన్ల శిశువులు 18 ఏండ్ల లోపు మహిళలకు కలిగారని, అందులో 3.4 లక్షల శిశువులు 15 ఏండ్ల లోపు తల్లులకు జన్మించడంతో మాతాశిశు ఆరోగ్యం సంక్షోభంలో పడుతున్నదని హెచ్చరిస్తున్నారు.

2070ల్లో 200 కోట్లు దాటనున్న భారత జనాభా:

2024లో భారత జనాభా 145 కోట్లు ఉండగా, 2054 నాటికి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత దేశంగా 169 కోట్లకు చేరవచ్చని తెలిపారు. 2100 నాటికి 80 ఏండ్లు దాటిన ప్రపంచ వృద్ధుల జనాభా మూడు రెట్లు పెరగవచ్చని, 15 ఏండ్ల లోపు, 64 ఏండ్లు దాటిన కుటుంబంపై ఆధారపడే పిల్లలు/వృద్ధుల జనాభా 77.5 శాతం చేరే అవకాశం ఉండవచ్చని పేర్కొన్నారు. 2060ల్లో భారత దేశ జనాభా 1.7 బిలియన్లకు, 2070 నాటికి జనాభా 2 బిలియన్ల మార్కు చేరవచ్చని, 2100 వరకు 2.2 బిలియన్లకు చేరవచ్చని ఐరాస నివేదిక స్పష్టం చేస్తున్నది. భారత్‌లో లింగ నిష్పత్తి 2036 నాటికి క్రమంగా పెరుగుతూ 952 మహిళలు : 1000 పురుషులులకు చేరుతుందని వివరించారు.

అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో జనాభా పెరుగుదల:

చైనా, దక్షిణ కొరియా, ఇటలీ, స్పెయిన్ లాంటి దేశాల సంతానోత్పత్తి అత్యల్పంగా 1.4 వరకు చేరడం గమనార్హం. చైనా, రష్యా, జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో రానున్న 30 ఏండ్లలో జనాభా 14 శాతం తగ్గుతుందని విశ్లేషించారు. ఇప్పటికే ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలవడం మనకు తెలుసు. ఇదే రికార్డును 2100 వరకు భారత్ తన తొలి స్థానాన్ని నిలుపుకుంటుందని తెలిపారు. ప్రపంచ జనాభా సగటు వయస్సు క్రమంగా పెరుగుతున్నదని, రానున్న ఏండ్లలో ప్రపంచమే వృద్ధ/పిల్లల జనాభాగా మారనుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గడం, పేద/మధ్య ఆదాయ దేశాల్లో జనాభా గణనీయంగా పెరగడం జరగవచ్చు.

రానున్న దశాబ్దాల్లో ప్రపంచ మానవాళి సగటు వయస్సు పెరగడం భవిష్యత్తు సంక్షోభంగా నిలువనుంది. అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత దేశం తన ప్రథమ స్థానాన్ని 2100 వరకు నిలుపుకుంటుందని తేల్చారు. భారత్ జనాభా 2.2 బిలియన్ల (210 కోట్లు) వరకు చేరే అవకాశం ఉండడం కూడా భారతీయులకు పెద్ద ప్రమాదంగా నిలువనుందని తేల్చడం గమనార్హం. నేటి ప్రపంచ జనాభా స్థిరీకరణ కావడమే ఉత్తమమని, జనాభా పెరిగితే అల్ప, మధ్య ఆదాయ దేశాలు మరింత ప్రమాదంలో పడకుండా వారి జనాభా పెరగకుండా చూడడమే ఏకైక మార్గమని గమనించాలి.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# సాంస్కృతిక విలువలు, వారసత్వం, ప్రాచీన సంప్రదాయాలు భారత్, ఇండోనేషియా ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంపొందిస్తున్నాయి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:ఇండోనేషియాలోని జకార్తాలో శ్రీ సనాతన ధర్మాలయం మహా కుంభాభిషేకం సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, మురుగన్ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పా.హషీమ్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ కోబాలన్, తమిళనాడు, ఇండోనేషియాకు చెందిన ప్రముఖులు, పూజారులు, ఆచార్యులు, ప్రవాస భారతీయులు, ఇండోనేషియా, ఇతర దేశాలకు చెందిన పౌరులు, ఈ దివ్యమైన, అద్భుతమైన ఆలయాన్ని సాకారం చేసిన ప్రతిభావంతులైన కళాకారులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ వేడుకలో పాల్గొనడం తన అదృష్టమని, అధ్యక్షుడు ప్రబోవో హాజరు కావడం తనకు ఈ కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకం చేసిందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. జకార్తాకు భౌతికంగా దూరంగా ఉన్నప్పటికీ, ఈ కార్యక్రమానికి తాను మానసికంగా దగ్గరగా ఉన్నానని, ఇది బలమైన భారత్–ఇండోనేషియా సంబంధాలను ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి అన్నారు. అధ్యక్షుడు ప్రబోవో ఇటీవల 140 కోట్ల మంది భారతీయుల అభిమానాన్ని ఇండోనేషియాకు తీసుకెళ్లారని, ఆయన ద్వారా ఇండోనేషియాలోని ప్రతి ఒక్కరూ ప్రతి భారతీయుడి శుభాకాంక్షలను అనుభూతి చెందినట్టు తాను భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. జకార్తా ఆలయ మహా కుంభాభిషేకం సందర్భంగా ఇండోనేషియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మురుగన్ భక్తులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తిరుప్పుగళ్ భజనల ద్వారా మురుగన్ కీర్తి కొనసాగాలని, అలాగే స్కంద షష్టి కవచం మంత్రాల ద్వారా సమస్త ప్రజల కు రక్షణ కలగాలని ప్రధాని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణం కలను సాకారం చేయడంలో కృషి చేసిన డాక్టర్ కోబాలన్ ను, ఆయన బృందాన్ని అభినందించారు.

"భారత్, ఇండోనేషియా మధ్య సంబంధాలు కేవలం భౌగోళిక–రాజకీయాలకు పరిమితం కాదు, వేలాది సంవత్సరాల భాగస్వామ్య సంస్కృతి, చరిత్రలో పాతుకుపోయాయి" అని ప్రధాన మంత్రి ఉద్వేగంగా అన్నారు. రెండు దేశాల మధ్య బంధం వారసత్వం, విజ్ఞానం, విశ్వాసం, పరస్పర విశ్వాసాలు, ఆధ్యాత్మికత పై ఆధారపడి ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ సంబంధంలో మురుగన్, రాముడు బుద్ధుడు కూడా ఉన్నారని అన్నారు. భారతదేశానికి చెందిన ఎవరైనా ఇండోనేషియాలోని ప్రంబనన్ ఆలయాన్ని సందర్శించినప్పుడు కాశీ, కేదార్ నాథ్ లలో ఉన్న మాదిరి ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతారని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో వాల్మీకి రామాయణం, కంబ రామాయణం, రామచరిత మానస్ వంటి భావోద్వేగాలను కాకవిన్, సెరాత్ రామాయణ కథలు ప్రతిబింబిస్తాయని ఆయన తెలిపారు. భారతదేశంలోని అయోధ్యలో ఇండోనేషియా రామ్ లీలాను కూడా నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. బాలిలో "ఓం స్వస్తి–అస్తు" వింటే భారత్ లోని వేద పండితుల ఆశీస్సులు గుర్తుకు వస్తాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఇండోనేషియాలోని బోరోబుదూర్ స్థూపం భారత్లోని సారనాథ్, బుద్ధగయలో కనిపించే బుద్ధుడి బోధనల తో సమానమైన సందేశాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒడిశాలో జరిగే బలి జాత్రా ఉత్సవం పురాతన కాలంలో భారతదేశం, ఇండోనేషియాల మధ్య ఉన్న సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలను గుర్తుచేస్తుందని చెప్పారు. నేటికీ భారతీయులు గరుడ ఇండోనేషియా ఎయిర్‌లైన్స్‌లో ప్రయాణించినప్పుడు, ఉభయ దేశాల మధ్య ఉన్న ఉమ్మడి సంస్కృతిని స్పష్టంగా చూడగలుగుతున్నారని ఆయన పేర్కొన్నారు.

భారత్, ఇండోనేషియా మధ్య సంబంధాలు అనేక బలమైన దారాలతో అల్లుకుందని, అధ్యక్షుడు ప్రబోవో ఇటీవల భారత పర్యటన సందర్భంగా, ఈ ఉమ్మడి వారసత్వంలోని అనేక అంశాలను ఎంతో ఆస్వాదించారని ప్రధాని పేర్కొన్నారు. జకార్తాలో కొత్తగా నిర్మించిన ఈ గొప్ప మురుగన్ ఆలయం శతాబ్దాల నాటి వారసత్వానికి కొత్త సువర్ణ అధ్యాయాన్ని జోడిస్తుందని, ఈ ఆలయం విశ్వాసానికి, సాంస్కృతిక విలువలకు కొత్త కేంద్రంగా మారుతుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

జకార్తాలోని మురుగన్ దేవాలయంలో మురుగన్ మాత్రమే కాకుండా అనేక ఇతర దేవతలు కూడా ఉన్నారని పేర్కొన్న శ్రీ మోదీ, ఈ వైవిధ్యం, బహుళత్వం మన సంస్కృతికి పునాది అని చెప్పారు. ఇండోనేషియాలో ఈ భిన్నత్వ సంప్రదాయాన్ని 'భిన్నెకా తుంగల్ ఇకా' అని, భారత్ లో భిన్నత్వంలో ఏకత్వం అని పిలుస్తారని తెలిపారు. ఇండోనేషియా, భారత్ రెండింటిలోనూ భిన్న మతాల ప్రజలు ఇంత సామరస్యంతో జీవించడానికి ఈ భిన్నత్వాన్ని అంగీకరించడమే కారణమని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని స్వీకరించడానికి ఈ పవిత్రమైన రోజు మనకు స్ఫూర్తినిస్తుందని ఆయన పేర్కొన్నారు.

"సాంస్కృతిక విలువలు, వారసత్వం, భారత్, ఇండోనేషియా దేశాల ప్రజల మధ్య సంబంధాలను పెంపొందిస్తున్నాయి" అని శ్రీ మోదీ అన్నారు. ప్రంబనన్ ఆలయాన్ని పరిరక్షించాలని ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయం, బోరబుదూర్ బౌద్ధాలయం పట్ల ఉమ్మడి నిబద్ధతను ఆయన ప్రస్తావించారు. అయోధ్యలో ఇండోనేషియా రామ్ లీలాను ప్రస్తావిస్తూ, ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. అధ్యక్షుడు ప్రబోవోతో కలిసి తాము ఈ దిశలో వేగంగా ముందుకు సాగుతామని ప్రధాన మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. గతమే బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని పేర్కొన్నారు. ఆలయ మహా కుంభాభిషేకం సందర్భంగా అధ్యక్షుడు ప్రబోవోకు కృతజ్ఞతలు తెలుపుతూ, అందరినీ అభినందిస్తూ ప్రధాని తమ ప్రసంగాన్ని ముగించారు.

# ఏఐ సాంకేతికతలో ముందు వరుసలో భారత్ : చంద్రబాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు సీఎం చంద్రబాబు. ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారని తెలిపారు. పవర్, ఇన్సూరెన్స్, మైనింగ్ సహా పలు రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చామని. పలు రంగాల్లో భారీ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఏపీలోనే తొలిసారి విద్యుత్ రంగం సంస్కరణలు తీసువచ్చామని పేర్కొన్నారు

నేడు ఢిల్లీ లో ఆయన మీడియా తో మాట్లాడుతూ ,వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చారని.. రాష్ట్ర అభివృద్ధికి ఇంకా కష్టపడాలని అన్నారు. గత పాలనతో రాష్ట్ర అభివృద్ధి 30 ఏళ్లు వెనక్కి వెళ్ళిందని వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి కొంత ప్రయారిటి ఇచ్చారన్నారు. బడ్జెట్‌లో ఏం ఇచ్చారని కొందరు అంటున్నారని. మన పేరు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 16 వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌తో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చర్చిస్తానని.. లోటు బడ్జెట్ ఉందని పేర్కొన్నారు

భారత్ అభివృద్ధిని ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయని చంద్రబాబు అన్నారు. ఏఐ సాంకేతికతలో భారత్ ముందు వరుసలో ఉందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ పేరు మారుమోగుతోందని తెలిపారు. ఫుడ్ సెక్యూరిటీకి గ్లోబల్ హబ్‌గా భారత్ మారబోతోందని వెల్లడించారు. ఎమ్ఎస్ఎమ్ఈ పాలసీకి గేమ్‌ఛేంజర్‌గా భారత్ మారనుందని పేర్కొన్నారు. భారత్‌లో భారీ పెట్టుబడులకు పారిశ్రామిక వేత్తలు వస్తున్నారని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించబోతోందని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు.

బీజేపీ, ఎన్డీఏకు ఎందుకు ఓట్లు వేయాలో చెప్పడానికి ఢిల్లీ వచ్చానని అన్నారు. ఢిల్లీ చూసినప్పుడు అందరిలో ఒక అభిప్రాయం వస్తుందని.. ఢిల్లీలో వాతావరణ కాలుష్యం, రాజకీయం కాలుష్యం ఆరోగ్యానికి హానికరమన్నారు. ఢిల్లీలో కలుషితమైన నీరు ఉందని.. యమున కలుషితం అయిపోయిందన్నారు. వికసిత భారత్ రియాలిటీ అని చెప్పుకొచ్చారు. దావోస్‌లో అందరూ ఇండియా గురించి మాట్లాడుతున్నారన్నారు.

నేటి మధ్యాహ్నం 2.30 గంటలకు ఢిల్లీ నుంచి ఏపీ సచివాలయానికి చంద్రబాబు రానున్నారు. ఆర్టీజీతో పాటు ప్రభుత్వ పథకాల, కార్యక్రమాల అమలుపై ఫీడ్ బ్యాక్‌పై సమీక్ష చేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు సచివాలయం నుంచి ఉండవల్లి నివాసానికి వెళతారు సీఎం చంద్రబాబు.ంఖ ఔవలిబ: ఆ పదవి కోసం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి వ్యూహంబంగారం ధరలు షాక్ కొట్టిస్తున్నాయి..

# కనకదుర్గమ్మ ఆలయంలో పూర్ణాహుతి



అమరావతి, ఫిబ్రవరి 3: శ్రీ క్రోధి సంవత్సర మగశుద్ధి పంచమి సందర్భంగా సరస్వతి దేవి అలంకరణలో కనకదుర్గమ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ పంచమి సందర్భంగా సోమవారం విజయవాడలోని అందరికీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కొలువైయున్న కనకదుర్గమ్మ సరస్వతీ దేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. జ్ఞానప్రదాయని వాగ్దేవి అయిన సరస్వతి దేవిని పూజిస్తే జ్ఞాన సిద్ధి కలిగి చైతన్యవంతులవుతారని వేదాలు చెబుతున్నాయి.

సరస్వతి దేవి అలంకరణలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు సాధారణ భక్తులతో పాటు విద్యార్థులు పెద్ద ఎత్తున కొండకు తరలివచ్చారు. స్కూల్, కళాశాల యూనిఫాంలో వచ్చిన విద్యార్థులకు దేవస్థానం అధికారులు ఉచితంగా దర్శనభాగ్యాన్ని కల్పించారు. వీరి కోసం ప్రత్యేక క్యూలైన్లను సైతం ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం విద్యార్థులకు పెన్ను, అమ్మవారి ప్రతిమ, రక్ష, లడ్డు ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు.

దేవస్థానంలో కొత్తగా నిర్మించిన యాగశాలలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి రామచంద్ర మోహన్ ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం నిర్వహించిన ఈ పూర్ణాహుతి కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులతో పాటు వేద పాఠశాల విద్యార్థులు, వేద పండితులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిజెపి పార్టీలకు 8 మంది చొప్పున ఎంపిలు ఉన్నా సాధించిన నిధులు సున్నా: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ ఫిబ్రవరి 3 : కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలకు 8 మంది చొప్పున ఎంపిలు ఉన్నా సాధించిన నిధులు సున్నా అని చురకలంటించారు. ఆదివారం ఆమె తన ట్విట్టర్ లో ట్వీట్ చేశారు. తెలంగాణ పట్ల బిజెపికి చిత్తశుద్ధి లేదని, ఈ బడ్జెట్ తో తేటతెల్లమైందని విమర్శించారు. అదే సమయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన అసమర్థతను మరోసారి నిరూపించుకుందని కవిత దుయ్యబట్టారు. దేశంలోని స్పైసెస్, టీ, రబ్బర్ బోర్డులకు బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయించిందని, పసుపు బోర్డుకు మాత్రం నయాపైసా ఇవ్వకపోవడం విడ్డూరమని కవిత ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లూ పసుపు బోర్డు తెచ్చామని గొప్పలు చెప్పుకొన్న బిజెపి ఎంపిలు ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

# 4 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు

హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 22 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం మొదటి సారి సీసీ కెమెరాల నిఘాలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 208 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశారు. కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు ప్రాక్టికల్ పరీక్షలను పర్యవేక్షించనున్నారు.

రాష్ట్రంలో ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయకుండానే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ జూనియర్ కళాశాలల్లో ఎక్కువగా థియరీపైనే దృష్టి సారించి, ప్రాక్టికల్స్‌ను విస్మరించారన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కాలేజీల్లో అవసరమైనా సామాగ్రి లేకపోవడం, మరికొన్నింటిలో నేర్పించే సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ప్రాక్టికల్స్‌లో ఫుల్ మార్కులు వేయించొచ్చులే అన్న ధీమా ప్రైవేట్ కళాశాలలు నామమాత్రంగానే ప్రయోగాలు నిర్వహించి, తమ విద్యార్థులకు ఫుల్ మార్కులు వేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో తొలిసారి రాష్ట్రంలో సిసి కెమెరాల నిఘాలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో మాదిరిగా ఈసారి కూడా విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షల్లో పూర్తి మార్కులు వస్తాయా..? లేదా..? అనేది చూడాలి. ఇంటర్ సైన్స్ గ్రూప్‌లకు చెందిన విద్యార్థుల ప్రాక్టికల్ మార్కులు కీలకం. ఇంటర్ ప్రాక్టికల్స్‌లో ఎంపిసి వారికి 60 మార్కులు, బైపిసి వారికి 120 మార్కులు ఉన్నాయి. అయితే విద్యార్థులు వందకు వంద మార్కులు వస్తే తప్ప సంతృప్తి చెందడం లేదు.

# నగర, పట్టణ కార్పొరేషన్ ఉప ఎన్నికల్లో టీడీపీ హవా

–హిందుపూర్ మున్సిపల్ పీఠం కైవసం
–ఏలూరు, నెల్లూరు, బుచ్చిరెడ్డి పాలెం, పాలకొండలోనూ పాగా
–తిరుపతి, పిడుగురాళ్ల, నందిగామ ఎన్నికలు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 3: రాష్ట్రవ్యాప్తంగా పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో జరిగిన ఉప ఎన్నికలలో టీడీపీ ఘన విజయం



సాధించింది. మొత్తం 10 పురపాలికలలో నేడే ఏడు చోట్ల ఎన్నికలు నిర్వహించారు. ఈ ఏడింటిని తెలుగుదేశం కైవసం చేసుకుంది. హిందూపురం, పాలకొండ చైర్మన్ పోస్ట్ లు, బుచ్చిరెడ్డిపాలెం, తుని, పిడుగురాళ్ల, ఏలూరు, నూజీవీడులోని వైస్ చైర్మన్ పదవులను దక్కించుకుంది. మూడు చోట్ల కోరం లేకపోవడంతో ఎన్నికలు రేపటి వాయిదా వేసింది.

## ఏలూరులో రెండు పోస్ట్ లు టీడీపీకే ..

ఏలూరు కార్పొరేషన్‌లో ఇద్దరు డిప్యూటీ మేయర్ల ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. మొత్తం 50మంది కార్పొరేటర్లకు గాను, 30మంది టీడీపీ కార్పొరేటర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి కూడా హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు తొలి డిప్యూటీ మేయర్‌గా, 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని రెండో డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైసీపీ కార్పొరేటర్లు ఈ ఎన్నికలకు దూరంగా ఉండటంతో ఈ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయింది. డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీ అభ్యర్థులు ఒప్పందంతోనే ముందుకు రావడంతో ఏకగ్రీవ విజయం సాధించారు. ఈ ఫలితంతో ఏలూరు కార్పొరేషన్‌లో టీడీపీ మరింత బలపడిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## హిందూపురం మున్సిపల్ పీఠం టీడీపీ కైవసం

హిందూపురం మున్సిపల్ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. ఆరో వార్డు కౌన్సిలర్ రమేశ్ కుమార్ ఛైర్మన్ గా ఎన్నికయ్యారు. చేతులెత్తే విధానంలో ఎన్నిక నిర్వహించారు. ఎన్డీఏ కూటమికి ఎంపీ, ఎమ్మెల్యే ఓటుతో కలిపి 23మంది బలం ఉండటంతో మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని టీడీపీ దక్కించుకుంది. ఈరోజు నిర్వహించిన ఓటింగ్ లో టీడీపీకి అనుకూలంగా 23ఓట్లు వైసీపీ అభ్యర్థి వెంకటలక్ష్మికి 14ఓట్లు పడ్డాయి. ఓటింగ్ లో ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ పార్థసారథి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేశ్ ను హిందూపూర్ ఎమ్మెల్యే బాలకృష్ణ అభినందించారు. రమేష్ ను ఛైర్మన్ సీట్లో బాలయ్య కూర్చోబెట్టారు. ఆరు నెలల క్రితం వైసీపీ ఛైర్‌పర్సన్ ఇంద్రజ రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది.

నెల్లూరు డిప్యూటీ మేయర్ కూడా

నెల్లూరు డిప్యూటీ మేయర్ టీడీపీ మద్దతు అభ్యర్థి తహసీన్ ఎన్నికయ్యారు. 29 ఓట్ల మెజారిటీతో ఆమె ఎన్నికయ్యారు. ఆమె 41 ఓట్లు, వైకాపా అభ్యర్థి కరీముల్లాకు 12 ఓట్లు వచ్చాయి. తహసీన్ గెలిచినట్లు అధికారులు ప్రకటించారు. ఆమెకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి నారాయణ ఆలోచనతో మైనార్టీ అభ్యర్థిని పెట్టారని.. తాను బలపరిచినట్లు చెప్పారు. తహసీన్ ఎన్నికకు సహకరించిన కార్పొరేటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ, మంత్రి ఆలోచనలను తెదేపా అదిష్టానం ఆమోదించిందన్నారు. ఈ గెలుపుతో నెల్లూరు నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కు బహుమానం ఇచ్చామని పేర్కొన్నారు.

బుచ్చిరెడ్డిపాలెంలో

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ వైస్ చైర్మన్లుగా తెదేపా మద్దతు అభ్యర్థులు ఎన్నికయ్యారు. మొదటి వైస్ చైర్మన్ గా 8వ వార్డుకు చెందిన ఎరటపల్లి శివకుమార్ రెడ్డి, రెండో వైస్చర్మన్ గా 8వ వార్డుకు చెందిన పటాన్ నస్తిన్ ఎన్నికయ్యారు. ఇక తుని, నూజీవీడు, పిడుగురాళ్ల వైస్ ఛైర్మన్ పోస్ట్ లు కూడా టీడీపీ ఖాతాలోనే పడ్డాయి.

తిరుపతి, పిడుగురాళ్ల, నందిగామలో ఎన్నిక వాయిదా

తిరుపతి నగరపాలక డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడింది. కోరం లేక వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. సభ నిర్వహణకు అవసరమైన సభ్యులు రాకపోవడంతో ఈమేరకు నిర్ణయించారు. పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కౌన్సిల్ సమావేశానికి వైకాపా కౌన్సిలర్లు రాకపోవడంతో ఎన్నికను ఆర్డీవో రేపటికి వాయిదా వేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కోరం లేనందున ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.

# నిర్మాత కేపీ చౌదరి ఆత్మహత్య

హైదరాబాద్,ఫిబ్రవరి 3:ప్రముఖ నిర్మాత కేపీ చౌదరి (కృష్ణప్రసాద్) ఆత్మహత్య చేసుకున్నారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కేపీ చౌదరి గోవాలో బలవన్మరణానికి పాల్పడ్డారు. గోవాలోని ఆయన ఇంటి నుంచి వాసన వస్తుండటతో స్థానికులు నేడు ఫిర్యాదు చేశారు.. దీంతో పోలీసులు వెళ్లి చూసేసరికి ఆయన నిర్జీవంగా కనిపించారు. దీంతో పోలీసులు ఆత్మహత్య కేసు నమోదు చేసుకున్నారు.

కేపీ చౌదరి పూర్తి పేరు కృష్ణప్రసాద్ చౌదరి. 2016లో సినీ రంగంలోకి ప్రవేశించాడు. సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన కబాలి సినిమా తెలుగు వర్షన్‌కు ఆయన నిర్మాతగా వ్యవహరించారు.

పలు తెలుగు, తమిళ సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేశారు. సర్దార్ గబ్బర్ సింగ్, అర్జున్ సురవరం, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి పలు సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేశారు.

అయితే నిర్మాతగా మారిన తర్వాత కేపీ చౌదరికి కలిసి రాకపోవడంతో గోవాలో ఓమ్ పబ్‌ను స్టార్ట్ చేశాడు. అక్కడ కూడా లాస్ రావడంతో తనకు ఉన్న పరిచయాలతో సెలబ్రెటీలకు డ్రగ్స్ విక్రయాలు చేయడం మొదలుపెట్టారని అప్పట్లో వార్తలు వచ్చాయి . హైదరాబాద్‌లోని వరలక్ష్మి టిఫిన్స్ డ్రగ్స్ కేసులోనూ కేపీ చౌదరి నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు విచారణ ప్రస్తుతం జరుగుతున్నది.

ఆహ్వానము
రావి రంగారావు సాహిత్యపీఠం గుంటూరు
2025 ఫిబ్రవరి 7 శుక్రవారం సా. 6 గం. కు
అన్నమయ్య కళా వేదిక, బృందావన్ గార్డెన్స్
శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం, గుంటూరు
స్వాగతం : డా. రావి అరుణ, డైరెక్టర్, రావి రంగారావు సాహిత్య పీఠం
జ్యోతి ప్రకాశం : శ్రీ చిటిపోతు మస్తానయ్య , అధ్యక్షులు, దేవాలయ పాలక మండలి
సభాధ్యక్షులు : శ్రీ గద్దె మంగయ్య , కార్యదర్శి, ఆర్ వి ఆర్ ఆర్ విద్యా కళాశాల
ముఖ్య అతిథి : శ్రీ గోనుగుంట్ల కోటేశ్వరరావు, అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్
విశిష్ట అతిథి : డా. తరపట్ల సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం, రాజమండ్రి
పురస్కార కార్యక్రమ నిర్వహణ : డా. మైలవరపు లలిత కుమారి
జన రంజక కవి ప్రతిభా పురస్కార గ్రహీతలు
శ్రీమతి గుమ్మా నాగ మంజరి : "పుష్ప మంజరి" (పద్యాలు)
శ్రీ ప్రకాష్ నాయుడు : నాన్న ఎందుకో వెనకబడ్డాడు (వచన కవితలు)
శ్రీ రాజేశ్వరరావు లేదాళ్ళ : అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి (వచన కవితలు)
శ్రీరత్నాజీ నేలపూరి : గాజు లేని జాగా
వందన సమర్పణ : శ్రీ గడల శివ ప్రసాద్
రావి రంగారావు సాహిత్య పీఠం (రి. నం. 6/2016),

# అయిదేళ్లలో ఆర్థికంగా పతనం: సాయం చేయలంటూ ఆర్థిక సంఘం చైర్మన్‌కు చంద్రబాబు వినతి

–ఆర్థికంగా చేయూత ఇస్తే బయటపడతాం
–ఉన్నవనరులను సద్వినియోగం చేసుకుంటాం
–లాజిస్టిక్ , పోర్టు, పరిశ్రమలు, ఐటి, ఎఐలపై దృష్టి పెట్టాం
–గ్రీన్ ఎనర్జ్ పై ప్రత్యేక దృష్టి సారించాం
–ఇవన్ని ముందుకు సాగాలంటే నిధులు అవసరం
–పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో ఎపి పరిస్థితి వివరణ
–తగిన సాయం చేయలంటూ 16వ ఆర్థిక సంఘం చైర్మన్‌కు చంద్రబాబు వినతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: గత అయిదేళ్లలో ఆర్థికంగా చితికిపోయాం? మళ్లీ గాడిన రాష్ట్రం పడాలంటే నిధులు అధికంగా ఇవ్వాని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ వనగడియాను కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం నేడు ఆయనతో భేటి అయ్యారు. ఈ




సమావేశం సుమారు రెండు గంటల పాటు జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తొలుత 45 నిమిషాల అనుకున్న భేటీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై రెండు గంటల పాటు చర్చ జరిగింది.

ఏపీ ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల వైసీపీ దుష్పరిపాలన, పలు రంగాల వారీగా జరిగిన నష్టంపై 16వ ఆర్థిక సంఘానికి చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీ తక్కువ జీడీపీ ఉండటం, దానికి గల కారణాలపై కూడా ప్రజంటేషన్‌లో వివరించారు. ఇటీవల నీతి ఆయోగ్ ఇచ్చిన ఆర్థిక ఆరోగ్య నివేదికలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గురించి చెప్పిందని, రాష్ట్రం అప్పు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నివేదించిందని చంద్రబాబు గుర్తుచేశారు.

## ఏపీ చాలా నష్ట పోయింది..

2014–19 మధ్య అభివృద్ధికి, ఆ తర్వాత ఐదేళ్లలో చోటు చేసుకున్న దుష్పరిపాలనతో పొంతన లేకుండా పోయిందని, రాష్ట్రం చాలా నష్ట పోయిందని ప్రజంటేషన్‌లో చంద్రబాబు తెలిపారు. 2019–24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రత్యేకంగా ప్రజంటేషన్‌లో వివరించారు. దీని కారణంగా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చూపుతున్న ప్రభావం గురించి ప్రత్యేకంగా వివరించారు. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు తీసుకువచ్చారని, దానికి తోడు మరో రూ. లక్షన్నర కోట్లకు పైగా? పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని తెలిపారు. ఈ పరిణామాల నుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రజంటేషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులు, లాజిస్టిక్ పార్కులు, పరిశ్రమలు వచ్చేందుకు అనువైన వాతావరణాన్ని ఎలా తయారు చేస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఉన్న మార్గాలపై కూడా వివరించి అందుకు సహకరించాలని కోరారు.

## ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు..

పోర్టు ఆధారిత, పరిశ్రమల ఆధారిత అభివృద్ధి ఎలా చేయాలన్న దానిపై ఇరువురు నేతలు కీలకంగా చర్చించారు. డీప్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ, ఏఐకు సంబంధించిన విషయాలను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై ప్రజంటేషన్‌లో సవివరంగా చంద్రబాబు చెప్పారు. తిరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూనే అన్ని అంశాల్లో ఆర్థిక సంఘం కూడా తగిన సహకారం ఇవ్వాలని కోరారు. ప్రజంటేషన్ అనంతరం చాలా అంశాలపై చంద్రబాబు, అరవింద్ పనగడియా చర్చించారు. దేశంలో ఆర్థిక వ్యవస్థలను బలోపేతం దిశగా తీసుకువెళ్లడంలో చంద్రబాబు తీసుకున్న చర్యల గురించి అరవింద్ పనగడియా ప్రస్తావించారు.

## పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం..

ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏడు రాష్ట్రాలు పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం సాధిస్తున్నారని, తెలంగాణ మాత్రమే అందుకు భిన్నంగా ఉందని ఇరువురి మధ్య చర్చించారు. తెలంగాణ కూడా ఎక్కువగా హైదరాబాద్ ఆధారంగానే అభివృద్ధి పథంలో ఉందని, గతంలో చేపట్టిన చర్యలు హైదరాబాద్‌ను ప్రపంచానికి అనుసంధానం చేశాయని పనగడియా పేర్కొన్నారు.

బిల్ గేట్స్ హైదరాబాద్ రావడం, దాని కొనసాగింపుగా.. చాలా ప్రపంచ సంస్థలు ఎలా హైదరాబాద్‌కు అనుసంధానం అయ్యాయన్న విషయాను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్థిక వ్యవహారాల్లో గుజరాత్, మహారాష్ట్ర మోడల్స్‌తో పాటు సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రయోగంలో హైదరాబాద్ మోడల్ ఎలా విజయవంతం అయిందో ఇరువురి మధ్య చర్చ జరిగింది. వీటితో పాటు 2014–19 మధ్య స్వచ్ఛ భారత్, డిజిటల్ కరెన్సీ వంటి విషయాల్లో చంద్రబాబు ఇచ్చిన నివేదికలు, ప్రస్తుతం వాటి ఫలితాలను చర్చ సందర్భంగా అరవింద్ పనగడియా ప్రస్తావించారు. ఇక ఎపి తగిన ప్రాజెక్ట్ లు ,నిధులు మంజూరులో తమవంతు సాయం చేస్తానని పనగడియా హామీ ఇచ్చారు..

# ఈ ఆలయాన్ని సాకారం చేసిన ప్రతిభావంతులైన కళాకారులందరికీ శుభాకాంక్షలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:గౌరవనీయ అధ్యక్షుడు ప్రబోవో, మురుగన్ ఆలయ ట్రస్టు చైర్మన్ పా హాషీం, ధర్మకర్త డాక్టర్ కోబాలన్, ఉన్నతాధికారులు, తమిళనాడు, ఇండోనేషియాకు చెందిన పురోహితులు, ఆచార్యులు, భారత సంతతి ప్రజలు, ఈ పవిత్ర కార్యంలో పాల్గొంటున్న ఇండోనేషియా, ఇతర దేశాల పౌరులు.. దివ్యమైన, మహత్తరమైన ఈ ఆలయాన్ని సాకారం చేసిన ప్రతిభావంతులైన కళాకారులందరికీ శుభాకాంక్షలు!

జకార్తాలోని మురుగన్ ఆలయ మహా కుంభాభిషేకంలో భాగస్వామినవడం నా అదృష్టం. నా సోదరుడు, అధ్యక్షుడు ప్రబోవో హాజరై ఈ కార్యక్రమాన్ని నాకు మరింత ప్రత్యేకంగా చేశారు. భౌతికంగా నేను జకార్తాకు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ.. భారత్, ఇండోనేషియా సంబంధాల్లాగే ఈ కార్యక్రమంతో హృదయసామీప్యాన్ని అనుభూతి చెందుతున్నాను. కొన్ని రోజుల కిందటే 140 కోట్ల మంది భారతీయుల ప్రేమాభిమానాలను మూటగట్టుకుని అధ్యక్షుడు ప్రబోవో భారత్ నుంచి వెళ్లారు.

పవిత్ర జకార్తా ఆలయ మహా కుంభాభిషేకం సందర్భంగా మీకూ.. భారత్, ఇండోనేషియా సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భగవాన్ మురుగన్ భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. తిరుప్పుగల్ కీర్తనలతో పూజలందుకుంటున్న భగవాన్ మురుగన్, ఆ స్కంద షష్టి కవచ మంత్రం ప్రజలందరినీ రక్షించాలని నేను ప్రార్థిస్తున్నాను. ఎంతో కష్టపడి ఈ ఆలయ నిర్మాణాన్ని సాకారం చేసిన డాక్టర్ కోబాలన్, ఆయన బృందానికి నా అభినందనలు.

భౌగోళిక రాజకీయాలకు అతీతంగా భారత్, ఇండోనేషియా ప్రజల సంబంధాలు విస్తరించి ఉన్నాయి. వేల ఏళ్ల నాటి నాగరికత మనల్ని కలిపి ఉంచుతోంది. వేల ఏళ్ల నాటి చారిత్రక సంబంధాలు మనకున్నాయి. వారసత్వం, విజ్ఞానం, విశ్వాసాలతో కూడిన బంధం మనది. ఉమ్మడి విశ్వాసాలు, ఆధ్యాత్మికత మన బంధాన్ని నిర్మించాయి. భగవాన్ మురుగన్, భగవాన్ శ్రీరామచంద్రుడు మనల్ని అనుసంధానించారు. బుద్ధ భగవానుడు కూడా మనకు వారధి. అందుకే మిత్రులారా.. భారతీయులెవరైనా ఇండోనేషియాలోని ప్రంబనన్ ఆలయాన్ని సందర్శించి చేతులు జోడించినప్పుడు కాశీ, కేదారనాథ్ మాదిరిగానే ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతారు. భారతీయులు కకావిన్, సెరత్ రామాయణాల గురించి విన్నప్పుడు.. వాల్మీకి రామాయణం, కంబ రామాయణం, రామచరిత మానస్ లాగానే భావిస్తారు.

ఇప్పుడు అయోధ్యలో కూడా ఇండోనేషియా రాంలీల ప్రదర్శిస్తున్నారు. అలాగే, బాలీలో 'ఓం స్వస్తి అస్తు' అన్న మాట వినగానే భారత్ లోని వేద పండితులు పఠించే స్వస్తి వచనం స్ఫురణకు వస్తుంది. భారత్ లోని సారనాథ్, బుద్ధగయలో మాదిరిగానే.. అవే బుద్ధుడి బోధనలను ఇండోనేషియాలోని బోరోబుదూర్ స్థూపమూ ప్రతిబింబిస్తుంది. ఒడిశాలో నేటికీ బలి జాతర నిర్వహిస్తారు. ఒకప్పుడు భారత్, ఇండోనేషియాను వాణిజ్యపరంగానూ సాంస్కృతికంగానూ అనుసంధానించిన ప్రాచీన సముద్రయానంతో ముడిపడి ఉన్న వేడుక ఇది. ఈనాటికీ, విమాన ప్రయాణాల కోసం 'గరుడ ఇండోనేషియా' ఎక్కితే ఉమ్మడి సంస్కృతి ప్రతిబింబించడాన్ని చూడొచ్చు.

ఎన్నో బలమైన సూత్రాలతో మన అనుబంధం అల్లుకుని ఉంది. అధ్యక్షుడు ప్రబోవో ఇటీవల భారత్ ను సందర్శించినప్పుడు ఈ ఉమ్మడి వారసత్వానికి సంబంధించిన అనేక అంశాలపై మేం ముచ్చటించుకుని ఆస్వాదించాం. నేడు జకార్తాలోని ఈ గొప్ప మురుగన్ ఆలయ ప్రారంభోత్సవంతో మన పురాతన వారసత్వంలో మరో సువర్ణాధ్యాయం మొదలవుతోంది. ఈ ఆలయం మన విశ్వాసాలకు మాత్రమే కాకుండా, సాంస్కృతిక విలువలకు కూడా కేంద్రంగా ఉంటుందని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను.

ఈ ఆలయంలో మురుగన్ తో పాటు అనేక ఇతర దైవాలను కూడా ప్రతిష్ఠించారని తెలిసింది. ఈ వైవిధ్యం ఈ బహుళత్వం – మన సంస్కృతికి పునాది. ఈ తాత్వికతను ఇండోనేషియాలో భిన్నేకా తుంగళ్ ఇకా అని పిలుస్తారు. భారత్ లో దీనిని భిన్నత్వంలో ఏకత్వమంటాం. ఇండోనేషియాలోనూ భారత్ లోనూ వివిధ వర్గాల ప్రజలు సామరస్యంగా కలసిమెలసి జీవించడానికి ఈ భిన్నత్వం దోహదపడుతుంది. అందుకే నేటి పవిత్ర ఉత్సవం కూడా భిన్నత్వంలో ఏకత్వం దిశగా మనకు స్ఫూర్తినిస్తోంది.

మన సాంస్కృతిక విలువలు, మన వారసత్వం నేడు భారత్, ఇండోనేషియా మధ్య ప్రజా సంబంధాలను బలోపేతం చేస్తున్నాయి. ప్రంబనన్ ఆలయ పరిరక్షణ కోసం ఉమ్మడి కార్యక్రమానికి మనం శ్రీకారం చుట్టాం. బోరోబుదూర్ బౌద్ధ ఆలయంపట్ల కూడా ఉమ్మడి అంకితభావం మనకుంది. అయోధ్యలో ఇండోనేషియా రాంలీలా ప్రదర్శనల గురించి నేనిప్పుడే చెప్పాను.. ఇలాంటి కార్యక్రమాలను మనం మరింత ప్రోత్సహించాలి. అధ్యక్షుడు ప్రబోవోతో కలిసి ఈ దిశగా గొప్ప వేగంతో ముందుకు సాగుతామని విశ్వసిస్తున్నాను. మన గతం సువర్ణ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుంది. మరోసారి అధ్యక్షుడు ప్రబోవోకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను, ఆలయ మహా కుంభాభిషేకం సందర్భంగా మీ అందరికీ శుభాకాంక్షలు.

# ఆప్ అఖండ విజయం సాధించబోతోంది- కేజ్రీవాల్

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ ఆదివారం భారతీయ జనతా పార్టీ (బిజెపి)పై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండగా బిజెపి'గూండాయిజానికి' పాల్పడుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు. కేజ్రీవాల్ ఢిల్లీలో విలేకరుల గోష్ఠిలో మాట్లాడుతూ, ఈ నెల 5న జరగనున్న ఎన్నికల్లో ఆప్ 'నిర్ణయాత్మక విజయం' దిశగా సాగుతోందని, ఇది బిజెపి నేతలను, ముఖ్యంగా కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షాను 'కంగు తినిపించింది, దిక్కుతోచని స్థితికి నెట్టింది' అని చెప్పారు. 'ఆప్ అఖండ విజయం సాధించబోతోంది, అమిత్ షా కంగు తిన్నారు. ఓటమి తప్పదని గ్రహించినందున బిజెపి గూండాగిరికి దిగుతోంది' అని కేజ్రీవాల్ అన్నారు. బిజెపి కార్యకర్తలు బెదరిస్తున్నారని, ఆప్ వాలంటీర్లు, మద్దతుదారులపై దౌర్జన్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 'మా నాయకులు, మద్దతుదారులను బిజెపిలో చేరాలని, లేకపోతే అరెస్టు, దాడులను ఎదుర్కోవలసి వస్తుందని బెదరిస్తున్నారు. కానీ, మమ్మల్ని భయపెట్టజాలరు' అని ఆయన చెప్పారు. అటువంటి 'బెదరింపు ఎత్తుగడలను' ఢిల్లీ సహించబోదని ఆయన స్పష్టం చేశారు. బెదరింపుల ఆరోపణలకు స్పందనగా 'ఎక్స్'లో 'అమిత్‌షాకీగూండాగర్దీ' అనే హ్యాష్‌ట్యాగ్‌తో కొత్త సోషల్ మీడియా ప్రచారం ప్రారంభించినట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. 'దాడి, బెదరింపు, హెచ్చరిక' గురించిన తమ అనుభవాలను ఆ హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగించుకుని పంచుకోవలసిందిగా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. 'బిజెపికి ఢిల్లీకి ఏ లక్ష్యమూ లేదు, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరూ లేరు, అభివృద్ధి అజెండా ఏదీ లేదు. వారికి ఉన్నది అంతా గూండాయిజమే. వోట్ల ద్వారా కాకుండా భయపెట్టడం ద్వారా గెలవాలని వారు కోరుకుంటున్నారు' అని కేజ్రీవాల్ విమర్శించారు. నగర భద్రత, ప్రజాస్వామిక సమగ్రత కోసం బిజెపికి వ్యతిరేకంగా సంఘటితం కావలసిందిగా ఢిల్లీ వాసులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు 5న జరగనుండా 8న ఫలితాలు వెలువడనున్నాయి.

# మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 3:తెలంగాణలో ప్రవేశ పరీక్షల షెడ్యూల్ ను ఉన్నత విద్యా మండలి ఇప్పటికే ఖరారు చేసింది. ఏప్రిల్ 29నుంచి మే 5 వరకు ఈఏపీ సెట్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 22 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తాజాగా ఉన్నత విద్యామండలి ప్రకటించింది.

ఏప్రిల్ 29, 30తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగనున్నాయి. మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఈఏపీ సెట్ జరగనుంది. ఈఏపీ సెట్ పరీక్షలు జేఎన్టీయూ నిర్వహిస్తోంది.


# గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం..

అమరావతి, ఫిబ్రవరి 3: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండల పరిధిలో నేలటూరు తీరం వద్ద రెండు రోజుల క్రితం గల్లంతైన షణ్ముఖ నాయుడు అనే విద్యార్థి మృతదేహం ఇవాళ లభ్యమైంది. స్థానిక ఎస్సై జేపీ శ్రీనివాస్ రెడ్డి మృతదేహాన్ని వెతికించారు.

ఏపీ జెన్కో ప్రాజెక్ట్ బ్రేక్ వాటర్ రాళ్ల వద్ద శవం ఉన్నట్లు కనుగొన్నారు. విద్యార్థి ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి లబోదిబోమన్నారు.

# ఉప్పల్ గడ్డ నుండి వరంగల్ బహిరంగ సభకు భారీగా తరలివెళ్ళినన బిసిలు

-భారీ కాన్వాయ్‌ను జెన్డా ప్రారంభించిన వెంకటేశ్వర్లు యాదవ్



హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తీర్మార్ మల్లన్న పిలుపుమేరకు వరంగల్ ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో జరగబోయే హలో బీసీ చైతన్య సభకు ఉప్పల్ గడ్డ నుండి భారీ కాన్వాయ్ తో భయ్యా వెంకటేశ్వర్లు యాదవ్ 20 , కార్లు రెండు బస్సులలో దాదాపు 200 మందితో బయలుదేరి వెళ్ళాడు. ఈ సందర్భంగా ఆయన కాన్వాయ్ ని జండా ఉపి ప్రారంబించారు. ఈ సందర్భంగా భయ్యా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రము లో బీసీ నాయకుడు బీసీలు ఐక్యమయ్యే సమయం ఆసీనమైనది కావున ప్రతి ఒక్కరు ఆత్మవంచన చేసుకొని బీసీ గౌరవం కొరకు అందరు సంఘటితమై ముందుకు రావాలని భయ్యా వెంకటేశ్వర్ యాదవ్ పిలుపునిచ్చారు. ఇక ఓసీల ఆగడాలు సాగవని ఎన్నాళ్లు మీ అరాచకాలు ఆధిపత్యాలు చూస్తూ ఊరుకుంటాం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బిడ్డలమంతా ఏకమవుతున్నాం మేమెంతో మాకంత అనే నినాదంతో ముందుకు వెళున్నామన్నారు. ఓట్లు మాయి సీట్లు మియా ఇక సాగవు మీ కుట్రలు కుతంత్రాలు సగావన్నారు. ఈ సభకు బయలుదేరిన వారిలో భయ్యా వెంకటేశ్వర్లు యాదవ్ కనకయ్య ముదిరాజ్ వంశీ గణేష్ యాదవ్ శ్రీనివాస్ యాదవ్ నవీన్ యాదవ్ రామచందర్ వరలక్ష్మి అనూష ప్రసన్న రమాదేవి దుర్గా భారతి మౌనిక నవీన్ లతోపాటు 200 మంది బయలుదేరినారు

# ఉద్రిక్తతలనడుమ డిప్యూటీ మేయర్ ఎన్నికలు



తిరుపతి, ఫిబ్రవరి 3: తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల తిరుపతి, చిత్తూరులో ఉద్రిక్తతలకు దారి తీసింది. సోమవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ మేయర్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లను కూటమి నేతలు ఆదివారం రాత్రి నుంచి చిత్తూరులోని భాస్కర్ హోటల్‌లో నిర్బంధించారు. బయటకు రాకుండా కూటమి నేతలు కార్లను అడ్డంగా పెట్టారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లను విడిపించేందుకు వైఎస్సార్‌సీపీ నేత భూమన అభినయ్ రెడ్డిని కూడా కూటమి నేతలు నిర్బంధించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్, టీడీపీ నాయకులు జేబీ శ్రీనివాసులు, మాజీ టౌన్ చైర్మన్ పులిగోరు మురళీ, క్రిష్ణా యాదవ్ టీడీపీ కార్యకర్తలు, నేతలతో కలిసి అభినయ్ రెడ్డిని ముట్టడించారు. అనంతరం, పోలీసులు అక్కడికి రావడంతో కూటమి వెనక్కి తగ్గారు. దీంతో, భాస్కర హోటల్ నుంచి తిరుపతికు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు బయలుదేరారు. ఎక్కడికక్కడ నిర్బంధంవైసీపీ కార్పొరేటర్లను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వైసీపీ రాజేష్‌ను పొద్దుపొడవకముందే అలిపిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆయన కోసం భూమన అభినయ్ రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రాజేష్‌ను బయటకు పంపాలంటూ డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ ఎన్నికను జరగకుండా గొడవలు చేయాలని కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారని, పోలీసులు వారికి సహకారం అందిస్తున్నారంటూ మండిపడ్డారు. కార్పొరేటర్లను జనసేన ఎమ్మెల్యే, కూటమి నేతలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ ఆరోపించారు. కోడి కూయక ముందే కూల్చివేతలువైసీపీ రెండవ డివిజన్ కార్పొరేటర్ ఉమా అజయ్‌కు చెందిన ఆస్తుల ధ్వంసానికి అధికారులు సోమవారం ఉదయాన్నే రంగం సిద్ధం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నేతలతో కలిసి అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి వైసీపీ కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురి చేసే విధంగా కూటంమి ప్రభుత్వం కుట్రలకు తెరతీసిందని మండిపడ్డారు. అప్రజాస్వామిక పద్ధతిలో ప్రభుత్వ అధికారులను ఉపయోగించుకుని అధికారమే పరమావధిగా చెలరేగిపోతున్నారని దుయ్యబట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అధికారులు నడుచుకుంటే భవిష్యత్తులో న్యాయస్థానాలు చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. మెజారిటీ లేక పోయినాభూమన కరుణాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఒక్క కార్పొరేటర్ బలమే ఉన్న టీడీపీ నేతలు వైసీపీ సభ్యులను బెదిరించి గెలవాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు. వైసీపీ కార్పొరేటర్లపై కూటమి ప్రభుత్వం, నాయకులు, అధికారులు దుర్మార్గంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం ఇంత నీచంగా వ్యవహరించాలా? ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి పూట మహిళా కార్పొరేటర్లు ఉన్న గదికి వెళ్లి దౌర్జన్యం చేశారని ఆరోపించారు. కార్పొరేటర్ల ఆస్తులు విధ్వంసం చేశారని, బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. కార్పొరేటర్ల బంధువులు, కుటుంబ సభ్యులకు అక్రమంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కూటమి నేతలపై ఈసీకి వైసీపీ ఫిర్యాదు..



అమరావతి, ఫిబ్రవరి 3:మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పదవుల కోసం జరుగుతున్న ఎన్నికల్లో కూటమి నేతలు అరాచకాలు సృష్టిస్తున్నారని వైసీపీ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ప్లానింగ్ కమిషన్ మాజీ ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి లు ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నాయకులను ప్రలోభ పెడుతూ, మాట వినని వారినిభయపెట్టి పదవులు కైవసం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరుగుతుంటే పోలీసులు మాత్రం మౌనంగా ఉండడం దారుణమన్నారు. తిరుపతి, హిందూపురం, నెల్లూరు మున్సిపల్ ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ కార్పొరేటర్లపై దాడికి తెగబడ్డారని, దాంతో ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్‌లో జరుగుతున్న ఎన్నికలను వాయిదా వేయాలని వైయస్ఆర్‌సీపీ నేతలు కోరారు.

విజయవాడ బందర్ రోడ్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని కలిసిన ఎన్టీఆర్ జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అంకంరెడ్డి నారాయణమూర్తి తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు.

ఈసందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ తిరుపతిలో ఎన్నికలు జరగకుండా టీడీపీ నేతలు దాడి చేసారని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రత్యేక అధికారిని నియమించాలని ఇటీవల ఎన్నికల కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేసామని, భయపెట్టి, బతిమాలి, ప్రలోభపెట్టి ఎన్నికల్లో గెలవాలని టీడీపీ నేతలు చూస్తున్నారని విమర్శించారు.


# యమునా నది శుద్ధి అయినట్లేనా- రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:కొత్త రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేస్తానని రాజకీయాల్లోకి అడుగుపెట్టిన అరవింద్ కేజ్రీవాల్ చివరకు నరేంద్ర మోదీకి దూప్ లాగా మారిపోయాడని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ రాహుల్ గాంధీ ఆమ్ ఆద్మీ నేతపై మండిపడ్డారు. ఐదేళ్లలో యమునా నదిని శుద్ధి చేస్తానని కేజ్రీవాల్ హామీ ఇచ్చి పదేళ్లు గడిచాయని చెప్పారు. యమునా నది శుద్ధి అయినట్లేనా అని ప్రశ్నించారు. దమ్ముంటే యమునా నది నీటిని తాగాలని కేజ్రీవాల్ కు సవాల్ విసిరారు.

ఆయన నిజంగానే తాగితే తర్వాత ఆసుపత్రికి వెళ్లి పరామర్శిస్తానని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఆ నీరు తాగితే ఆసుపత్రిలో చేరాల్సిందేననే చెబుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ కు, ప్రధాని నరేంద్ర మోదీకి తేడా లేదని, ఇద్దరూ ఒకటేనని రాహుల్ ఆరోపించారు. ఇటు ఆప్ లో, అటు బీజేపీలో.. రెండు పార్టీలు కూడా దళితులను దూరం పెడతాయని, పార్టీ అగ్ర నాయకత్వంలో ఒక్క దళితుడికీ చోటు లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆప్ లో చూసుకున్నట్లయితే కేజ్రీవాల్ సహా తొమ్మిది మంది పేర్లు మాత్రమే వినిపిస్తాయని, అందులో ఒక్కరు కూడా దళిత వర్గానికి చెందిన వారు లేరని విమర్శించారు. మోదీకి, కేజ్రీవాల్ కు మధ్య ఉన్న తేడా కేవలం ఒక్కటేనని, మోదీ ఓపెన్ గా మాట్లాడతారు కేజ్రీవాల్ మౌనంగా ఉంటారని చెప్పారు. అవసరమైన సందర్భాలలో కూడా కేజ్రీవాల్ బయటకు వచ్చి మాట్లాడరని రాహుల్ మండిపడ్డారు. ఢిల్లీ ఎన్నికలు ఐకమత్యానికి, ద్వేషానికి మధ్య జరుగుతున్న పోరాటమని రాహుల్ గాంధీ చెప్పారు. రెండు పార్టీలు, రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతున్న పోరాటమని వివరించారు. ఆర్‌ఎస్ఎస్ భావజాలంతో ద్వేషాన్ని వెదజల్లే బీజేపీకి, ఐకమత్యంతో ప్రేమను పంచే కాంగ్రెస్ పార్టీకి మధ్య పోరు అని చెప్పారు. ప్రస్తుతం పదవిలో ఉన్నారు కాబట్టి మోదీ పేరు చాలాచోట్ల వినిపిస్తోందని, పదవి నుంచి దిగిపోయాక ఎవరూ ఆయనను తలుచుకోరని రాహుల్ చెప్పారు.

# సోనూసూద్ ఉదారత- నాలుగు అంబులెన్స్‌లు బహూకరణ



అమరావతి, ఫిబ్రవరి 3:ఏపీకి నాలుగు అత్యాధునిక అంబులెన్స్‌లను ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ అందించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన అంబులెన్స్‌లను నేడు సీఎం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం వాహనాలు అందించినందుకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కరోనా సమయంలో ఆయన చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు.

సీఎం చంద్రబాబుతో భేటీ అనంతరం సోనూసూద్ మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ ఫెసిలిటీ అభివృద్ధి చేయడంలో మా వంతు కృషి చేస్తున్నా. చాలా మంది అంబులెన్స్‌లు కావాలని అడిగారు. అందుకే ఎమర్జెన్సీ లైఫ్ సేవింగ్ కోసం వాటిని అందిస్తున్నా. ఏపీ ప్రజలు నా హృదయానికి చాలా దగ్గరగా ఉంటారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఏపీ నా రెండో ఇల్లు లాంటిది. ఇక్కడి ప్రజలు నన్ను ఉన్నతస్థాయిలో నిలబెట్టారు. నా భార్య ఏపీకి చెందిన మహిళే. ఎవ్వరికీ ఏ అవసరం వచ్చినా ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటా. ప్రతి ఒక్కరూ గొప్పవారు అయ్యాక సమాజానికి సేవ చేయాలి. నటులు సైతం సినిమాల్లో నేమ్, ఫేమ్ సంపాదించాక తిరిగి సొసైటీకి ఎంతో కొంత ఇవ్వాలి. కొవిడ్ సమయం నుంచీ నేను చంద్రబాబుతో టచ్‌లో ఉన్నా. మొదటిసారిగా ఏపీకే అంబులెన్స్‌లు ఇచ్చా. నా ఫౌండేషన్ ప్రతి సామాన్యుడి కోసం పని చేస్తోంది. నేనూ సామాన్యుడిగానే ఉండాలని అనుకుంటా. ప్రజలకు సేవ చేయడానికే రాజకీయ నాయకులు ఉన్నారు. సీఎంకు ఇప్పుడే నాలుగు అత్యాధునిక అంబులెన్స్‌లు ఇచ్చా. అందులో టాప్ ఫెసిలిటీలు ఉన్నాయి. వేము ఇచ్చే వాహనాలను నడపేందుకు డ్రైవర్లు కావాలి, మెయిన్‌టనెన్స్ చేయాలి. ఆ సపోర్ట్ ఏపీ ప్రభుత్వం నుంచి వస్తోంది. రాష్ట్రంలో వాటి అవసరం ఎవ్వరికి ఉన్నా వాడుకోవచ్చు. సీఎం చాలా బాగా రిసీవ్ చేసుకున్నారు. ఇది చాలా మందిని ఇన్‌స్పైర్ చేస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నన్ను ఏపీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండమంటే నేను రెడీ. తెలుగులో సినిమాలు చేయలేకపోవడానికి ఫతే సినిమా నిర్మాణంలో బిజీగా ఉండడమే కారణం. ఈ సినిమాకు సిరీస్ కూడా ప్లాన్ చేస్తున్నానని" చెప్పారు.

# 2024-25 ఆర్థిక సంవత్సరంలో 3295.76 కోట్లతో 23 రాష్ట్రాల్లో SASCI పథకం కింద 40 ప్రాజెక్ట్‌లను ప్రభుత్వం మంజూరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:భారత ప్రభుత్వం 'మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం – ప్రపంచ స్థాయికి ఐకానిక్ టూరిస్ట్ సెంటర్ల అభివృద్ధి' కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశంలో 23 రాష్ట్రాల్లో ?3295.76 కోట్లతో 40 ప్రాజెక్ట్‌లను మంజూరు చేసింది. దేశంలోని దిగ్గజ పర్యాటక కేంద్రాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం, బ్రాండింగ్ మరియు వాటిని ప్రపంచ స్థాయిలో మార్కెటింగ్ చేస్తోంది. ఈ పథకం కింద మంజూరైన ప్రాజెక్టుల వివరాలు జతచేయబడ్డాయి.

ప్రాజెక్ట్ ప్రతిపాదనల సమర్పణ కోసం పర్యాటక మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలకు కార్యాచరణ మార్గదర్శకాలను జారీ చేసింది.

రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రాజెక్ట్ ప్రతిపాదనలు అందిన తర్వాత, సైట్‌కు కనెక్టివిటీ, టూరిజం పర్యావరణ వ్యవస్థ, వాహక సామర్థ్యం, సుస్థిరత చర్యలు, స్థిరమైన ఆపరేషన్ మరియు నిర్వహణ, ప్రాజెక్ట్ ప్రభావం మరియు సృష్టించిన విలువ, టూరిజం మార్కెటింగ్ వంటి అందించిన పారామితులపై మూల్యాంకనం చేయబడింది. ప్రణాళికలు మొదలైనవి. రాయాఅవి పథకం కింద మంజూరైన ప్రాజెక్టుల అమలును రాష్ట్ర ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు చేపడుతున్నప్పుడు, మంత్రిత్వ శాఖ మంజూరైన ప్రాజెక్టులను సజావుగా అమలు చేయడం కోసం, మంజూరైన ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు పర్యాటక శాఖ యంత్రాంగాన్ని కూడా రూపొందించింది.

# ఏపీ, తమిళనాడును కలుపుతూ కొత్తగా జాతీయ రహదారి



అమరావతి, ఫిబ్రవరి 3:కేంద్రంలో, రాష్ట్రంలో.. రెండుచోట్లా ఒకే ప్రభుత్వం ఉంటే అభివృద్ధి పరుగులు తీస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పదే పదే చెబుతుంటారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని అభివృద్ధిని ఉదహరిస్తుంటారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో, కేంద్రంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) ప్రభుత్వాలే ఉన్నాయి. అంతేకాకుండా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ లోక్ సభ సభ్యులు కీలకం కావడం కూడా రాష్ట్రానికి బాగా కలిసివస్తోంది. అభివృద్ధి పనులను మోడీ, బాబు పరుగులు తీయిస్తున్నారు. రాష్ట్రంలోని రహదారులను జాతీయ రహదారులుగా మారుస్తూ ఇప్పటికే పలు నిర్ణయాలను తీసుకున్న కేంద్రం తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొత్తంగా 84 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్ ను, తమిళనాడును కలుపుతూ కొత్తగా జాతీయ రహదారిని నిర్మించబోతున్నారు.

చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం మీదుగా తమిళనాడు సరిహద్దు వరకు 42వ నెంబరు జాతీయ రహదారిని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. పలమనేరు నుంచి కుప్పం వరకు రెండు వరుసలుగా ఉన్న రహదారిని నాలుగు వరుసలుగా మార్పు చేయబోతున్నారు.

అలాగే కుప్పం నుంచి తమిళనాడు సరిహద్దు వరకు ఉన్న మరో 20 కిలోమీటర్ల మార్గాన్ని కూడా నాలుగు వరుసలుగా మారుస్తారు. మొత్తంగా పలమనేరు నుంచి 84 కిలోమీటర్ల మార్గాన్ని నాలుగు లైన్లుగా మారుస్తున్నారు. ఈ మార్గంలో ఐదు ప్రాంతాల్లో బైపాస్ రోడ్లు రానున్నాయి. మరోపక్క బెంగళూరు – చెన్నై జాతీయ రహదారి పనులు కూడా జరుగుతున్నాయి.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

## –మూలమలుపు వద్ద బైక్‌పై నుంచి పడి యువకుడు..

హైదరాబాద్, ఫిబ్రవరి 3: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకున్న ది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం? మూడుచింతలపల్లి మండలం, కేశవరం గ్రామానికి చెందిన బన్నీయాదవ్(21) , మణిదీప్, మధులు చిన్ననాటి స్నేహితులు. ఈ ముగ్గురు తుర్కపల్లి పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో రోజువారి కూలీలుగా పనిచేస్తున్నారు. పనికి వెళ్లేందుకు బన్నీ, మణిదీప్‌లు పల్సర్ 220 బైక్స్‌ను కొనుగోలు చేశారు. ఆదివా రం సెలవురోజు కావడంతో ముగ్గురు కలిసి మణిదీప్ బైక్‌పై మూడు చింతలపల్లి మండల కేంద్రానికి వెళ్లి తిరిగి కేశవరానికి వస్తున్నారు. బైక్‌ను బన్నీయాదవ్ నడుపుతుండగా గ్రామ శివారు ప్రాంతంలోని మూలమలుపు వద్ద ఒక్కసారిగా కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో బన్నీయాదవ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మధుకు రెండు కాళ్ళు విరిగిపోగా మణిదీప్‌కు తీవ్ర గాయాలయ్యా యి. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, గాయపడినవారిని చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం నుంచి వస్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రాలీఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందాడు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం?కొండాపూర్ మసీద్‌బండా పీజీ హాస్టల్‌లో నివసించే ప్రతిభాచంద్ (25) గచ్చిబౌలిలోని ఐటీ కారిడా ర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం తెల్లావారుజామున 3 గంటల ప్రాంతంలో ప్రతిభాచంద్ రాయల్‌ఇన్‌ఫీల్డ్‌పై గచ్చిబౌలి కార్యాలయం నుంచి విధులు ముగించుకొ ని మసీదుబండా వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో గచ్చిబౌలి స్టేడియం ముందు రాంగ్‌రూట్‌లో వచ్చిన పాలప్యాకెట్ల లోడ్ కలిగిన ఆటోట్రాలీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రగాయాలైన ప్రతిభాచంద్‌ను సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మా ర్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాటేదాన్, టీఎన్జీఓస్ కాలనీకి చెందిన పోతులగుడి నాగమ్మ(45), కూతురు, మనుమరాలుతో కలిసి ద్విచక్రవాహనంపై హయత్‌నగర్ నుంచి ఎల్బీనగర్ వైపుకు బయలుదేరారు. మార్గమధ్యలో హయత్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఎదుట వెనకవైపు నుంచి అతివేగం దూసుకొచ్చిన నవత ట్రాన్స్‌పోర్టుకు చెందిన వాహనం (ఏపీ16టీజీ5926) బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై నుంచి నాగమ్మ ఎగిరి కిందపడగా పైనుంచి లారీ వెళ్లింది. దీం తో నాగమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి మనుమరాలు కిందపడడంతో స్వల్పంగా గాయపడింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో ప్రమాద స్థలం వద్ద గంటపాటు ట్రాఫిక్ జామ్ నెలకొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తాం

**అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

- భూ బదలాయింపునకు మార్గాలను అన్వేషిస్తున్నాం
- స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ భూకేటాయింపు అంశం మాదృష్టిలో ఉంది
- రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల ఇళ్లస్థలాల పాలసీ రూపొందించే పనిలోఉన్నాం



ఖమ్మం, ఫిబ్రవరి 3: (నేటినిజం ప్రతినిధి):మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు ఖమ్మం జిల్లాలోని మూడు ప్రధాన జర్నలిస్టు సంఘాలు, స్తంభాద్రి హౌసింగ్ సొసైటీ ప్రతినిధుల బృందం అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) శ్రీనివాసరెడ్డిని సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసింది. ఖమ్మం నియోజకవర్గ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు మీద సుదీర్ఘంగా చర్చించింది. ప్రభుత్వ జీవోలు, సొసైటీ ఏర్పాటు, సుప్రీంకోర్టు తీర్పు వంటి అంశాలను ఈ సమావేశంలో జర్నలిస్టు బృందం ప్రతినిధులు అడిషనల్ కలెక్టర్ కు సవివరంగా తెలియజేశారు. రాష్ట్రవ్యాప్త జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని అభినందిస్తూనే, త్వరితగతిన, మొదటి ప్రాధాన్యతలో ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని యూనియన్లు, సొసైటీ ప్రతినిదుల బృందం అడిషనల్ కలెక్టర్ ను కోరింది. రాష్ట్ర వ్యాప్త పాలసీతో పాటు, ఖమ్మంలోని స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అంశంను కూడా న్యాయ నిపుణులతో సంప్రదించి ఒక నిర్ణయం తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మూడు యూనియన్లు, హౌసింగ్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ భూ కేటాయింపులకు, సుప్రీంకోర్టు తీర్పులకు సంబంధం లేదన్న జర్నలిస్టు ప్రతినిధుల బృందం వాదనను కూడా పరిగణలోకి తీసుకొని పరిశీలిస్తామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి భూమి బదలాయింపు జరిపే దశలో ప్రక్రియ నిలిచి ఉన్నదని, వెంటనే జిల్లా అధికారులు, ప్రభుత్వ పెద్దలతో చర్చించి సత్వరం పరిష్కరిస్తామని తెలిపారు. న్యాయ నిపుణుల సలహా, ప్రభుత్వ అనుమతితో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని త్వరితగతన పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యూజే(ఐజేయు)జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు, టియుడబ్ల్యూజే(టీజేఎఫ్)జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, కోశాధికారి వెన్నబోయిన సాంబశివరావు, ఫెడరేషన్ నాయకులు రాము పాల్గొన్నారు.

# పాలము యొక్క పరిపాలన మరియు సాంఘిక సంక్షేమ కార్యాలయం బిబిబిపి చొరవ కింద జార్ఖండ్‌లో 100 దిన్ సంకల్ప్ అభియాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ బేటీ బచావో బేటీ పఢావో స్కీమ్ యొక్క 10వ వార్షికోత్సవాన్ని 22 జనవరి 2025న జరుపుకుంది. 2015లో ప్రారంభించబడిన బేటీ బచావో బేటీ పఢావో పథకం బాలికలకు రక్షణ, విద్య మరియు సాధికారత మరియు లింగ అసమతుల్యతను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశంలో తగ్గుతున్న పిల్లల లింగ నిష్పత్తి. బేటీ బచావో బేటీ పఢావో పథకం యొక్క లక్ష్యాలను సాధించడానికి, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు జిల్లాలు స్థానిక మరియు వాటాదారుల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి.

సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వానికి పేరుగాంచిన జార్ఖండ్‌లోని పాలము జిల్లా, బాలికలు మరియు మహిళలను, ముఖ్యంగా గ్రామీణ వర్గాల ప్రజలను ప్రభావితం చేసే సామాజిక సవాళ్లను చాలా కాలంగా ఎదుర్కొంటోంది.

బిబిబిపి చొరవ కింద జార్ఖండ్‌లోని 100 దిన్ సంకల్ప్ అభియాన్‌తో సమకాలీకరణలో, పాలములోని పరిపాలన మరియు సాంఘిక సంక్షేమ కార్యాలయం అనేక అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. లింగ అసమానత, మహిళల హక్కులు మరియు పిల్లల రక్షణ వంటి క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడం ఈ చొరవ లక్ష్యం.

"100 దిన్ బేటీ బచావో, బేటీ పఢావో" ప్రచారం ద్వారా వారాని కోసారి లక్ష్యాలను అనుసరించి ప్రభావవంతమైన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా లింగ సమానత్వం మరియు బాలికల సాధికారత సంస్కృతిని ప్రోత్సహించడంలో జార్ఖండ్‌లోని పాలము జిల్లా విశేషమైన విజయాన్ని సాధించింది. ప్రచారం విద్య, ఆరోగ్యం మరియు భద్రత వంటి క్లిష్టమైన సమస్యలను పరిష్కరించింది, చివరికి బాలికల సంక్షేమం మరియు హక్కులను మెరుగుపరుస్తుంది. ఈ ప్రత్యేక 100 రోజుల ప్రచారంలో, పాలము జిల్లాలో వివిధ అంశాలపై 70 కి పైగా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి, ఇందులో 125 మంది ప్రభుత్వ అధికారులు మరియు 22 మంది క్షేత్ర ప్రతినిధులు మరియు 216 మంది లబ్ధిదారులు పాల్గొన్న నాలుగు కార్యక్రమాలు ఉన్నాయి. అదేవిధంగా, బిబిబిపి వీక్, 100–రోజుల ప్రచారంలో అంకిత మైన వారం మరియు ప్రీ-కాన్సెప్షన్ ప్రినేటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్ (ఖఅఖఔఆ) ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్, 54 మంది అధికారులు మరియు 8 మంది స్థానిక ప్రతినిధుల భాగస్వామ్యంతో 178 మంది లబ్ధిదారులను చేర్చుకుని మూడు కార్యక్రమాలను నిర్వహించింది. ఈ కార్యక్రమాలు ప్రత్యేకంగా లింగ సమానత్వం మరియు పిల్లల రక్షణకు సంబంధించిన సమస్యలను పరిష్క రించడానికి రూపొందించబడ్డాయి మరియు వారి విజయం చొరవ యొక్క ప్రభావాన్ని నొక్కి చెబుతుంది.

# బీసీ కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం కాకి లెక్కలు -ఎమ్మెల్సీ కవిత



కరీంనగర్, ఫిబ్రవరి 3:రాష్ట్రంలో కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వం కాకి లెక్కలు చెప్పిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత అన్నారు. కరీంనగర్‌లో ఆమె నేడు మీడియాతో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83 లక్షల ఇళ్లు ఉన్నాయని, ఆనాడు కేంద్ర ప్రభుత్వం తేల్చిన జనాభా మూడు కోట్ల 50 లక్షలు కాగా, 2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో కోటి మూడు లక్షల ఇళ్లు, మూడు కోట్ల 68 లక్షల జనాభా ఉన్నట్లు తేలిందని గుర్తించారన్నారు. కేవలం నాలుగేళ్లలో చేసిన లెక్కలతో 20 లక్షల ఇళ్లు పెరిగాయని, 2014-2024 వరకు పదేళ్లలోపు ఎన్ని ఇళ్ళు ఎంత జనాభా ఉండాలి అని ప్రశ్నించారు.

## ఇవి కాకి లెక్కలు కావా..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేసిన సమగ్ర కుల గణనతో కోటి 15 లక్షల ఇళ్లు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోందని, జనాభా మూడు కోట్ల 70 లక్షలు అని చెప్పిందని, 2011 నుంచి 14 వరకు 20 లక్షల ఇళ్లు పెరిగితే 2014 నుంచి పదేళ్లలో సుమారు 60 లక్షల కుటుంబాలు పెరగాల్సి ఉంటుందని కవిత అన్నారు. 2023 వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి చెక్కులే 13 లక్షల 78 వేల ఇచ్చిందని, ప్రభుత్వం కనీసం 12 లక్షలు పెరిగినట్లు కూడా చూపించడం లేదని, ఏ లెక్కన చూసినా తెలంగాణలో 50 నుంచి 52 శాతం బీసీలు ఉన్నట్లు తెలుస్తుందని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 46.2శాతం ఉన్నట్లు తేల్చారని, ఇది కరెక్టా అని సీఎం రేవంత్ రెడ్డి గుండెమీద చేసుకుని చెప్పాలని, ఇవి కాకి లెక్కలు కావా.. అని ప్రశ్నించారు.

జనాభా లెక్కలపై అనుమానం ఉందని కవిత అన్నారు. వీా ప్రభుత్వం చేసిన లెక్కలు కరెక్టే అయితే, సర్వేలో తానిచ్చిన వివరాలు, తన పేరు ఆధార్ కార్డు కొడితే రావాలి కదా అని అన్నారు. మూడు కోట్ల 50 లక్షల మంది సర్వే రిపోర్ట్ వెబ్ సైట్ లో ఉంచాలని డిమాండ్ చేశారు. ఇది చిన్న విషయం? కాదు పెద్ద విషయం? ప్రభుత్వం ఆగమాగం చేస్తోందన్నారు. మంత్రివర్గ సమావేశం వెంటనే అసెంబ్లీ సమావేశం, సమావేశంలో ఇది లఘు చర్చ అని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు.

బీజీ జనాభా అంటే చిన్న చూపుస్తున్నారని కవిత అన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 46.2 శాతం ముస్లిం మైనార్టీల 10% మొత్తం 56% బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, బీఆర్‌ఎస్ పై నేపం నెట్టి ఎన్నికలను దూరం చేసే ప్రయత్నం చేయొద్దని, కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇంకా మిస్ అయిన వారి కోసం మళ్ళీ అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 15 రోజులపాటు రివ్యూకు అవకాశం ఇచ్చి ఎన్ రోల్ చేసుకోని వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ తర్వాత బీసీ సంఘాలను కలుపుకొని బీసీ సాధికారత, రాజకీయంగా బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ దక్కే వరకు పోరాడుతామన్నారు. జనాభా లెక్కలు తక్కువ చేసి చూపించే విధంగా చూడవద్దని ఆమె కోరారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ కట్టుబడి ప్రస్తుతం ప్రకటించిన జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

# అస్తిత్వం కోసమే సాంస్కృతిక ప్రదర్శన మందకృష్ణ మాదిగ

హైదరాబాద్, ఫిబ్రవరి 3: అస్తిత్వం కోసమే తమ సాంస్కృతిక ప్రదర్శన అని, దీనికి అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందనడం అన్యాయమని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 30 ఏళ్లలో ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించామని, ఎక్కడ శాంతిభద్రత సమస్య రాలేదని చెప్పారు. చెప్పుల తయారీ, డప్పు వాయిద్యం తమకు వారసత్వంగా వచ్చాయన్నారు. తమ మూలాలు కాపాడుకునేందుకు త్వరలో సాంస్కృతిక కార్యక్రమం చేపడతామన్నారు.

## ఎప్పుడూ శాంతిభద్రతల సమస్య రాలేదు

ఎమ్మార్పీఎస్ ఉద్యమం 1994లో మొదలుపెట్టామని, 1996 మార్చిలో మొట్టమొదటి బహిరంగసభనిర్వహించామని మందకృష్ణ మాదిగ తెలిపారు. ఉద్యమ విస్తరణ కోసం మొదటి రెండేళ్లు పనిచేశామని, వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించామని గుర్తు చేశారు. లక్షల మందిని సమీకరించినా ఎప్పుడూ సమస్య రాలేదని, ఎమ్మార్పీఎస్ ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదని స్పష్టం చేశారు. అలా చేస్తే ఇన్నేళ్లు ఉద్యమం నిలబడేది కాదన్నారు. అస్తిత్వం కోసమే తమ సాంస్కృతిక ప్రదర్శన అని, దీనికి అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందనడం అన్యాయమన్నారు. ఆరు అంశాలు చూపుతూ అనుమతి నిరాకరిస్తూ నోటీసులు ఇచ్చారన్నారు. దానికి వివరణ ఇస్తూ మరో వినతిపత్రం ఇస్తామని, గాంధేయ మార్గంలోనే ప్రయాణం కొనసాగిస్తాం. లక్ష డప్పులు, వేయి గొంతుకల కార్యక్రమానికి సీఎం అనుమతి ఇవ్వాలి. ఫిబ్రవరి 7న కార్యక్రమం అనుమతికి మరోసారి వినతిపత్రం ఇస్తామని, గిన్నిస్ బుక్‌లో చోటు దక్కేలా కార్యక్రమం ఉండబోతోందని మందకృష్ణ మాదిగ అన్నారు.

# అండర్-19 ఉమెన్స్ టీ20 టీమ్‌కు అయిదు కోట్ల నజరానా..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:అండర్-19 ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ విజేతలకు బీసీసీఐ నజరానా ప్రకటించింది. జట్టు మొత్తానికి రూ. 5 కోట్ల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ నగదును జట్టుతో పాటు సిబ్బందికి కూడా అందించనున్నట్లు పేర్కొంది. కాగా, ఆదివారం మలేసియా రాజధాని కౌలాలంపూర్ లో దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ పోరులో యువ భారత్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

భారత మహిళల జట్టు 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. తద్వారా వరుసగా రెండో సారి ప్రపంచకప్ టీ20 టైటిల్‌ను భారత అమ్మాయిలు కైవసం చేసుకున్నారు. మొదట బ్యాటింగ్ చేసిన సఫారీలను టీమిండియా 82 పరుగులకే కట్టడి చేసింది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా నిర్దేశించిన 83 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 11.2 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది.

తెలుగమ్మాయి గొంగడి త్రిష ఆల్ రౌండ్ షోతో అదరగొట్టింది. బౌలింగ్ లో 3 వికెట్లు పడగొట్టిన ఆమె.. ఓపెనర్ గా బరిలో దిగి 33 బంతుల్లో 44 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఈ వరల్డ్ కప్ లో త్రిష మొత్తం 309 పరుగులు చేసింది. బౌలింగ్ లో 7 వికెట్లు తీసి సత్తా చాటింది.

ఇలా టోర్నమెంట్‌లో ఆల్ రౌండర్ షోతో అదరగొట్టిన ఆమెకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డులు లభించాయి.

అటు టీమిండియా బౌలింగ్ విభాగంలో వైష్ణవి శర్మ (17 వికెట్లు), ఆయుశి శుక్లా (14 వికెట్లు) కూడా అద్భుతంగా రాణించారు. తద్వారా 2023 తర్వాత వరుసగా రెండోసారి యువ భారత్ ఈ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. దీంతో భారత అమ్మాయిలపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# యాదాద్రి భువనగిరి జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

## – తేదీ 25 ఫిబ్రవరి 2025 వరకు వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలి

యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );శ్రీ పాలకూర శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చౌటుప్పలమరియుశ్రీ బడుగు రామస్వామి కమలమ్మ ఫౌండేషన్ చౌటుప్పల సంయుక్త ఆద్వర్యం లో యాదాద్రి భువనగిరి జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నేదోక ప్రకటనలో తెలిపారు.ఎనిమిదవ తరగతి, 9వ తరగతి మరియు పదవ తరగతి విద్యార్థులకు యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి కాంపిటీషన్స్ నిర్వహించి నగదు పారితోషికముతో పాటు జ్ఞాపికలు ం అందజేయుడం జరుగుతుందనిఊ పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి రెండు టీములు మాత్రమే పాల్గొనాలి. ప్రతి టీం లో ముగ్గురు విద్యార్థులు ఉండాలి×నాలుగవ తరగతి నుండి పదవ తరగతి వరకు గల పాఠ్యాంశముల నుండి మరియు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు క్విజ్ కాంపిటీషన్లో అడగబడును.మొదటి బహుమతి 21000 మరియు షీల్డ్ ,రెండవ బహుమతి 15000మరియు షీల్డ్ ,మూడవ బహుమతి 12000 మరియు షీల్డ్,పాల్గొన్న ప్రతి టీంకు కన్సోలేషన్ బహుమతులు మరియు వ్యక్తిత్వ వికాస గ్రంధాలు అందజేయబడునని తెలిపారు.తేదీ 25 ఫిబ్రవరి 2025 వరకు వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవలసి ఉంటుంది.×క్విజ్ కాంపిటీషన్ నిర్వహణ తేదీనిఐదు రోజుల వ ం ం ం ద ం గ ా ప్రకటించబడుతుంది.×నిర్వహణ స్థలం చౌటుప్పల జిల్లా యాదాద్రి భువనగిరివివరాలకు చరవాణి నెంబర్ 98487 11424 మరియు 984817 55 03 సంప్రదించాలని కోరారు.


పెన్నా సాహిత్య పురస్కారం -2025
పెన్నా రచయితల సంఘం, నెల్లూరు.

చివరి తేది 31,మార్చ్ 2025

గత15 సంవత్సరాలనుండి ప్రతీ ఏడాది రాష్ట్ర స్థాయి ఉత్తమ కవితా సంపుటాలకు పురస్కారాలు అందజేస్తున్నాము.
ఈసంవత్సరం పెన్నా సాహిత్య పురస్కారానికి ....
2023 జనవరి నుంచి 2024 డిసెంబర్ వరకు ముద్రించ బడిన కవితాసంపుటాలను 3 కాపీలు కింది చిరునామకు పంపగలరు. చివరితేది 31,మార్చ్ 2025
వివరాలకు ఫోన్: 9848627158 సంప్రదించగలరు.

కవితా సంపుటాలు పంపవలసిన చిరునామా
గోవిందరాజు సుభద్రాదేవి
ఇంటి నంబరు:26-15-494
స్నేహ నగర్
కొండాయపాలెం రోడ్డు
నెల్లూరు,పిన్ కోడ్: 524004
ఆంధ్రప్రదేశ్
ఫోన్ నంబర్:9848627158

గోవిందరాజు సుభద్రాదేవి(అధ్యక్షురాలు)
పెన్నా రచయితల సంఘం
నెల్లూరు

